

ఘాట్ రోడ్డులో నిలిచిన లారీలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: పాడేరు ఘాట్ రోడ్డులో గురువారం ఉదయం ట్రాఫిక్ జామ్ అయింది. ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు తప్పించు కోబోయే క్రమంలో రోడ్డుకు అడ్డంగా ఇరుక్కు పోవడంతో ట్రాఫిక్ నిలిచి పోయింది. ఘాట్ లోని ఏసుప్రభు బొమ్మ మలుపు వద్ద లారీలు ఇరుక్కు పోయి రోడ్డుకు అడ్డంగా నిలిచింది. దీంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. సుమారు గంటన్నర పాటు పలు వాహనాలు, బస్సులు ట్రాఫిక్ లో నిలిచి పోయాయి.


ఘాట్‌లో ఇరుక్కుపోయిన లారీలు

బాధితులతో సమావేశానికి వస్తా..

-గిరిజనుల ఇళ్ల నిర్మాణాలకు అటవీ సిబ్బంది అభ్యంతరం చెప్పడం దారుణం
-సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు
-ఇళ్ల పట్టా అమ్మకాలు, బిల్లులపై జెడ్‌పిలో దుమారం


జిల్లా పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ సుభద్ర (ఇన్‌సెట్‌లో ప్రశ్నిస్తున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి:'జిల్లా పరిషత్ సమావేశంలో ప్రస్తావించిన సమస్యలకు హామీలు ఇవ్వడం తప్ప పరిష్కారం లభించడంలేదు. అనంతగిరిలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన స్థలాల్లో గిరిజనులు ఇళ్లు కట్టుకుంటే అటవీశాఖ సిబ్బంది అభ్యంతరం చెబుతున్నారు. ఇక్కడేమో ఆ సమస్య లేకుండా చూస్తామంటున్నారు. ఇళ్లు కట్టినచోట సిబ్బంది అభ్యంతరం చెబుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే వచ్చే జెడ్‌పి సమావేశానికి బాధిత గిరిజనులందరితో కలిసి వస్తాను' - అని అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి సభ్యుడు దీసరి గంగరాజు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మధాహ్నం ఛైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇళ్లు కట్టుకోవడానికి ఎంతోకాలంగా అటవీశాఖ సిబ్బంది పెడుతున్న ఇబ్బందులను సమావేశం దృష్టికి తీసుకొచ్చినప్పుడు, పాడేరు డివిజన్ అటవీశాఖాధికారి వినోద్‌కుమార్ స్పందిస్తూ... ఇళ్లు కట్టుకుంటున్న స్థలాల్లో నిర్మాణాలకు ఆటంకాల్లేకుండా చూస్తామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.బాబు మాట్లాడుతూ ఇళ్లకు ఎల్‌పిసిలు లేకపోయినా బిల్లుల చెల్లింపునకు ఇబ్బంది వుండదన్నారు. అనకాపల్లి మండలంలో సంపతపురం, కూండ్రం, వెంకుపాలెం, సీతానగరం లే అవుట్లను మార్చాలని ఎంపిపి సూరిబాబు కోరారు.

నిలదీతలు

ఇళ్ల పట్టాల అమ్మకంపై విచారణ ఎంతవరకు వచ్చిందని నర్సీపట్నం జెడ్‌పిటిసి రమణమ్మ నిలదీశారు. అనర్హుల పట్టాలను రద్దుచేసి అర్హులకు మంజూరుచేయాలన్నారు. బుచ్చెయ్యపేట జెడ్‌పిటిసి రాంబాబు మాట్లాడుతూ వడ్డాదిలో వేసిన మూడు లే అవుట్లలో 45 మంది పట్టాలమ్ముకున్నారని, అనర్హులకు పట్టాలివ్వడం వల్ల ఈ తరహా అమ్మకాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఏ సమస్యా పరిష్కరించనప్పుడు సమావేశంలో ప్రస్తావించడం ఎందుకని అన్నారు. సమస్యలిలానే వుంటే వచ్చే సమావేశానికి రానన్నారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి బిల్లులు చెల్లించాలని పద్మనాభం జెడ్‌పిటిసి గిరిబాబు అన్నారు. గుడిసెలు తొలగించి ఇళ్లు నిర్మించుకున్న గిరిజనులకు బిల్లులురాకపోవడంపై చింతపల్లి జెడ్‌పిటిసి బాలయ్యపడాల్ ఆవేదన వ్యక్తంచేశారు. గుడిసెలు లేక, ఇళ్లు కట్టులేక గిరిజనులు పడుతున్న ఇబ్బందులను తెలిపారు. వాడచీపురుపల్లి, పరవాడ పిహెచ్‌సిల్లో ఒక అంబులెన్స్‌నైనా అందుబాటులో ఉంచాలని పరవాడ జెడ్‌పిటిసి పైలా సన్యాసిరాజు అన్నారు. కెజిహెచ్‌లో చనిపోయిన గిరిజనులకు వయస్సుతో నిమిత్తంలేకుండా అంబులెన్స్‌లో ఇంటికి పంపించే ఏర్పాటు చేయాలని అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 186 పాఠశాలలు మూసేయాలన్న ప్రభుత్వ చర్యలపై ఆయన అభ్యంతరం తెలిపారు. హుకుంపేట మండలం తాడిపుట్టు పంచాయతీ ఉర్రాడ బొడ్డపుట్టు పాఠశాల ఆవరణలో విద్యుత్ స్తంభం పడి మృతి చెందిన తూభురు తన్విత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో విశాఖపట్నం, అనకాపల్లి జాయింట్ కలెక్టర్లు కెఎస్.విశ్వనాథన్, కల్పనాకుమారి, అనకాపల్లి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హేమంత్, డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సందీప్, జెడ్‌పి ఉపాధ్యక్షులు సత్యవతి, అప్పారావు, సిఇఒ శ్రీరామమూర్తి, డిప్యూటీ సిఇఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి
44 మంది నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో:ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. మొత్తంగా 44 మంది నామినేషన్లు వేశారు. ఈ నెల 16 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. బుధవారం నాటికి ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి 18 మంది నామినేషన్లు వేయగా చివరి రోజైన గురువారమే ఏకంగా 26 మంది నామినేషన్లు వేశారు.
నామినేషన్ల ప్రక్రియ తొలి రోజునే పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ సందడిగా తన నామినేషన్‌ను దాఖలు చేశారు. 22న ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు సీతంరాజు సుధాకర్ (వైసిపి), వేపాడ చిరంజీవిరావు (టిడిపి), పివిఎన్.మాధవ్ (బిజెపి) నామినేషన్లు వేశారు.

250 ప్రజా సంఘాలు బలపరిచిన అభ్యర్థిగా కోరెడ్ల రమాప్రభ

250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా సామాజిక కార్యకర్త డాక్టర్ కోరెడ్ల రమాప్రభ బరిలో ఉన్నారు. రోజు రోజుకూ ఉత్తరాంధ్ర నుంచి ఆమెకు మద్దతు పెరుగుతోంది. అధికారం అండ చూసుకుని వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు అనుకూలంగా ఎయు విసి పివిజిడి.ప్రసాద్‌రెడ్డి విశాఖలో ఈ నెల 19న ఓ హోటల్‌లో ప్రైవేటు విద్యాసంస్థలతో నిర్వహించిన సమావేశాన్ని కూడా ప్రజాసంఘాల కార్యకర్తలే బట్టబయలు చేశారు. ఉత్తరాంధ్ర ప్రజా సమస్యలపై గొంతుకగా డాక్టర్ రమాప్రభ అన్ని తరగతులనూ ఆకట్టుకునే ప్రచారంతో ముందుకెళ్తున్నారు. ఆమె చేస్తోన్న కృషిని ఉత్తరాంధ్రలో అన్ని రంగాలకు చెందిన ప్రజానీకం ముక్తకంఠంతో హర్షిస్తున్నారు.


తనిఖీలు చేపడుతున్న మిశ్రా

పెట్రోల్, డీజిల్ పక్కదారి పడితే చర్యలు

- ఉమ్మడి విశాఖ జిల్లా సేల్స్ ఆఫీసర్ మిశ్రా

ప్రజాశక్తి-హుకుంపేట: ప్రభుత్వం గిరిజన సహకార సంస్థ ఏర్పాటు చేసిన బంక్ నుండి పెట్రోల్, డీజిల్ పక్కదారి పట్టిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పదని విశాఖ ఉమ్మడి జిల్లా సేల్స్ ఆఫీసర్ ఎస్.మిశ్రా తెలిపారు. గురువారం మండల కేంద్రంలో పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ నాణ్యతను పరిశీలించారు. స్టాక్ రికార్డులు పరిశీలించారు. హెయిర్ మిషన్ ఏర్పాటు చేయకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మండల కేంద్రంలోనే పలు దుఖణాల వద్ద పెట్రోల్, డిజిల్ అమ్మకాలు లేకుండా చేస్తే జిసిసి బంకుకు మరింత ఆదాయం వస్తుందని తెలిపారు. .ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఆర్ఐ రంగారావు పాల్గొన్నారు.

చట్టాల రక్షణకు వినతి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఆదివాసి చట్టాలకు రక్షణ కల్పించాలని కోరుతూ బిజెపి అధికార ప్రతినిధి జివిఎల్ నరసింహారావుకు ఎస్‌టి మోర్చా నాయకులు కూడా కష్ణారావు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి మఠం శాంతకుమారి ఆధ్వర్యంలో ఆదివాసి హక్కుల పరిరక్షణ జెఎసి జిల్లా కన్వీనర్ రామారావుదొర ప్రతినిధి బృందం విశాఖలో గురువారం వినతి పత్రాన్ని అందజేశారు.ప్రభుత్వం ఆదివాసులకు అన్యాయం చేస్తూ హక్కులు, చట్టాలకు భంగం కలిగిస్తుందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

రైతు బజార్లలో జిసిసి చింతపండు అమ్మకం

ప్రజాశక్తి -విశాఖపట్నం:నగరంలోని రైతు బజార్లలో గిరిజన సహకార సంస్థ (జిసిసి) తమ స్టాల్స్‌లో గిరిజన్ పిక్క చింతపండును అమ్మకానికి పెట్టింది. గురువారం ఉదయం సీతమ్మధార రైతు బజార్లోని జిసిసి స్టాల్‌లో చింతపండు అమ్మకాలను జిసిసి మార్కెటింగ్ జనరల్ మేనేజర్ సురేంద్రకుమార్ ప్రారంభించారు. మూడు కేజీల పిక్క చింతపండు ప్యాకెట్‌ను రూ.130కు, ఐదు కేజీల పిక్క చింతపండు ప్యాకెట్‌ను రూ.215కు జిసిసి అమ్ముతోంది.


చేపడుతున్న అమ్మకాలు

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అరకులోయ:అరకులోయ మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం గురువారం ఎన్నికైంది. ఈ కార్యవర్గ ఎన్నికలు జిల్లా గౌరవ అధ్యక్షులు తాంగుల చిట్టిబాబు, జిల్లా కార్యదర్శి కిల్లో రఘునాథ్‌ల సమక్షంలో జరిగాయి. మండల యూటీఎఫ్ గౌరవ అధ్యక్షులుగా జె.మోహన్‌రావు, అధ్యక్షులుగా టి.విజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా జె.రాజకుమార్, కుమారి, ప్రధాన కార్యదర్శిగా రామచందర్, కోశాధికారిగా ఎం.నాగేశ్వరరావు, కార్యదర్శులుగా ఎల్‌బి చంద్రశేఖర్, సోమి, వి.శాంతి, జి.మహాలక్ష్మి. ఎల్.నాగమ్మ, ఆడిట్ కమిటీలుగా ఎం.శ్రీను, కె.సుబ్బారావు, జి.మచులమ్మ జిల్లా కౌన్సిలర్లుగా ఎల్.నారాయణ, ఎం.రమణ, శెట్టి రాజ్‌కుమార్, సలహాదారులుగా యూ.గంగరాజు, చంద్ర మోహన్‌దాస్, ఎరుకులులు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు జిల్లా గౌరవ అధ్యక్షులు చిట్టిబాబు తెలిపారు. ఈ సందర్భంగా నూతన సభ్యులు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.


పట్టుబడిన నాటుసారాను గొయ్యి తీసి అందులో వేస్తున్న పోలీసులు

416 లీటర్ల నాటు సారా ధ్వంసం

ప్రజాశక్తి-అడ్డతీగల

అడ్డతీగల పోలీస్ సర్కిల్ పరిధిలో దాడులు నిర్వహించగా పట్టుబడిన 416 లీటర్ల నాటు సారాను రంపచోడవరం ఎఎస్‌పి అదిరాజ్ సింగ్ రాణా సమక్షంలో అడ్డతీగల సిఐ వై.రాంబాబు ఆధ్వర్యంలో గురువారం భూమిలో గొయ్యి తీసి అందులో వేసి ధ్వంసం చేసినట్లు స్థానిక ఎస్సై అప్పలరాజు తెలిపారు. అడ్డతీగల, వై.రామవరం, గంగవరం, దుచ్చెర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలో కొంతకాలంగా జరిపిన దాడుల్లో ఈ నాటుసారా పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. అడ్డతీగల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిపిన దాడుల్లో 270 లీటర్లు నాటు సారా, గంగవరం స్టేషన్ పరిధిలో 100 లీటర్లు, వై.రామవరం స్టేషన్ పరిధిలో 28 లీటర్లు, దుచ్చెర్తి స్టేషన్ పరిధిలో 18 లీటర్ల సారా పట్టు పడినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల వీఆర్వో రాదయ్య, రెవెన్యూ సిబ్బంది, గంగవరం ఎస్ఐ చిన్నబాబు వై.రామవరం ఎస్సై సంతోష్ కుమార్, దుచ్చెర్తి ఎస్సై లతాశ్రీ, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణకు సన్మానం

ప్రజాశక్తి -సీలేరు

రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో ఏపీ జెన్కో సీలేరు ఈఈ లక్ష్మీనారాయణ ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా ఎంపికైన నేపథ్యంలో ఎస్సీ అసోసియేషన్ నాయకులు గురువారం ఆయన్ను సన్మానించారు. ఈ పోటీల్లో ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ కళాకారులు ప్రదర్శించిన 'ఐదోగది' ఉత్తమ నాటికగా, లక్ష్మీనారాయణ ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా ఎంపికైన విషయం విధితమే. ఈఈ లక్ష్మీనారాయణను అసోసియేషన్ నాయకులు పి.బాలకోటయ్య, విజయ్, ఏపీ జెన్కో కార్మిక సంఘ నాయకులు వై.సత్తిబాబు, ఏఈలు నాగబాబు, సురేష్, పవన్ ప్రియరాజ్, శిరోమణి, సబ్ ఇంజనీరు శ్రీధర్ పుష్పగుచ్ఛాలు అందజేసి దుస్సాలువ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జె.శ్రీను, సుకుమారు, నాగరాజు, నాగేశ్వరరావు, ప్రసాదు, యంగ్ ప్లేయర్స్ అసోసియేషన్ నాయకులు శ్యామ్ సన్ (బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.



ఇఇ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న ఎస్సీ అసోసియేషన్ నాయకులు

సమస్యల వలయంలో బిసి బాలికల వసతి గృహం

రెగ్యులర్ వార్డెన్ లేకపోవడంతో ఇబ్బందులు

ప్రజాశక్తి-చింతూరు

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌లో వసతులు కరువై సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. ఈ వసతి గృహంలో సుమారు 50 మంది బాలికలు ఉంటున్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారం ఆహారం ఉండటం లేదని, కనీసం వారానికి ఒక రోజు కూడా చికెన్ పెట్టడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. వసతి గృహం రక్షణ గోడ కూడా శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. అయినా పట్టించుకునే నాథుడే లేరు. వంట గదికి చెట్లు మొలిచి స్లాబ్ కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. రెగ్యులర్ వార్డెన్ లేకపోవడంతో హాస్టల్లో ఉన్న బాలికలు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడున్న వార్డెన్‌ను రంపచోడవరం బదిలీ చేశారు. ఆమె ఇక్కడ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తుండడంతో హాస్టల్ బాగోగులు చూసేందుకు అవకాశం లేకుండా పోతుంది. రాత్రి సమయంలో బాలికలు అనారోగ్యానికి గురైనా, ప్రమాదానికి గురైనా వారిని ఆసుపత్రికి తీసుకెళ్లే అవకాశం కూడా లేదు. హాస్టల్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అనారోగ్యకర వాతావరణం నెలకొంది. బాలికలకు రక్షణ మంచినీరు లేక నిత్యం అస్వస్థతకు గురవుతున్నారు. తక్షణమే ఈ హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


పడిపోవడానికి సిద్ధంగా ఉన్న ప్రహరీ


చింతూరు బిసి బాలికల వసతి గృహం

పవర్ కెనాల్ గండి మరమ్మతు పనులు పూర్తి

ఎపి జెన్‌కో ఎస్ఇ ప్రశాంత్‌కుమార్

ప్రజాశక్తి -సీలేరు

ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి పవర్ కెనాల్ గండ మరమ్మతు పనులు గురువారంతో పూర్తయినట్లు ఏపీ జెన్కో ఎస్ఇ (సివిల్) కెకెవి.ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ 2022 డిసెంబరు 14 అర్ధరాత్రి డొంకరాయి పవర్ కెనాల్‌కు గండిపడిన విషయాన్ని గుర్తు చేస్తూ, దీని మరమ్మతు పనులు స్థానికంగా ఉన్న కాంట్రాక్టులకు పనులు అప్పగించినట్లు చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి సుమారు నెలరోజుల్లో కెనాల్ బయట లోపల మరమ్మతు పనులు పూర్తి చేశామని తెలిపారు. ఏపీ జెన్కో ఉన్నతాధికారులు, సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ల పర్యవేక్షణలో కెనాల్ లోపల భాగంలో నాణ్యత లోపాలు జరగకుండా కాంక్రీట్ పనులు పూర్తి చేశామని వెల్లడించారు. అనంతరం పవర్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసి పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అనంతరం కెనాల్ బయటి వైపు మట్టి పనులు, కాంక్రీట్ పనులు పూర్తి చేశామన్నారు. పవర్ కెనాల్‌కు ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కెనాల్ అవుట్ సైడ్ భాగంలో రివీట్‌మెంట్ పనులు చేపట్టినట్లు తెలిపారు. పవర్ కెనాల్ నుంచి అవుట్ సైడ్‌కి వచ్చే ఊట నీరు వెళ్లేందుకు కాలువలుగా కాంక్రీట్‌తో ఏర్పాటు చేశామన్నారు. దీంతో పవర్ కెనాల్ మరమ్మతు పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. పవర్ కెనాల్‌కు ముందు ముందు ఇటువంటి సమస్యలు తలెత్తకుండా నిరంతరం ఇంజనీర్లు పర్యవేక్షణలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పవర్ కెనాల్ మరమ్మతు పనులకు ఎంతో ఖర్చు అయిందో ఇంకా ధ్రువీకరించవలసి ఉందని వెల్లడించారు.


మాట్లాడుతున్నఎస్ఇ ప్రశాంత్‌కుమార్

పసికందు మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి గ్రామానికి చెందిన మిరియాల సరస్వతికి జన్మించిన 4నెలల పసికందు కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. రాజవొమ్మంగి పిహెచ్‌సి వైద్యాధికారి లిఖిత తెలిపిన వివరాలు ప్రకారం... సరస్వతి పుట్టిన 4 నెలల ఆడబిడ్డ ఈ నెల 21 రాత్రి ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండగా తల్లి దండ్రులు తొలిత రాజవొమ్మంగి పిహెచ్‌సికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం పసికందు మృతి చెందింది. బిడ్డకు తల్లి పాలు ఇచ్చే సమయంలో సరైన జాగ్రత్తలు పాటించక పోవడం వలన పాలు ఊపిరితిత్తుల్లోకి వెళ్లడంతో పసికందు మరణించినట్లు డాక్టర్ లిఖిత తెలిపారు. కాగా ఏజెన్సీలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా మరణాలు సంభవిస్తునే ఉన్నాయని మండలవాసులు ఆందోళన చెందుతున్నారు. ఏజెన్సీలో శిశువుల ఆరోగ్య రక్షణకు మెరుగైన వైద్యం అందేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని గిరిజన సంఘం నాయకులు కోరుతున్నారు.

జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

నెల్లూరు అమీర్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో రాజవొమ్మంగి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుండి సుమారు 3వేల విద్యార్థులు పాల్గొన్నారు. రాజవొమ్మంగి జిల్లా పరిషత్ పాఠశాల నుండి 45 మంది విద్యార్థులు హాజరు కాగా, వీరిలో ఆరుగురు విద్యార్థులు బాల చిత్ర కళాశ్రీ అవార్డుతో బంగారు పతకాలు సాధించారు. ఈ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న టి.హారిక, హనీప్రియ, కామేశ్వరి, ఎనిమిదో తరగతి చదువుతున్న శ్రీదుర్గా, తొమ్మిదో తరగతి చదువుతున్న వీరలక్ష్మి, పదోతరగతి చదువుతున్న అపర్ణ బాల చిత్ర కళాశ్రీ సర్టిఫికెట్, బంగారు పతకాలు సాధించారు. వీరికి తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయుడు మిరియాల కొండబాబుకు అమీర్ ఆర్ట్స్ అకాడమీ ఆర్ట్స్ గురు బిరుదు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం అభినందన సభ ఏర్పాటు చేసి పతకాలు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయుడు మిరియాల కొండబాబును పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పిఎంసి కమిటీ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్‌వివిఎస్.మూర్తి, అర్జమ్మ, రాజబాబు, బాబురావు దొర, శ్రీను, సన్యాసమ్మ, కొండబాబు, నాగరాజు, లోవరాజు, లోవయ్య తదితరులు పాల్గొన్నారు.


సాధించిన కళాశ్రీ సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు



నిరసననుద్దేశించి మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

పాఠశాలల మూసివేతతో విద్యకు దూరం

- పలుచోట్ల నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ముంచింగిపుట్టు: అల్లూరి జిల్లా పరిధిలో 87 ప్రాథమిక పాఠశాలల మూసివేతను తీవ్రంగా ఖండిస్తూ మండల కేంద్రంలో గిరిజన సంఘం నేతలు గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో.సురేంద్ర మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని పాఠశాలల్లో 10 మంది విద్యార్థులు తక్కువ ఉన్నారనే నెపంతో 87 ప్రాథమిక పాఠశాలలు మూసివేతను వైసీపీ ప్రభుత్వం ప్రకటించడంతో సుమారుగా 1000 మంది గిరిజన విద్యార్థులు చదువుకు దూరం అవుతారన్నారు. దీంతో డ్రాప్ ఔట్ పెరుగుతుందన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 14 సంవత్సరంలోపు పిల్లలకు ఉచిత నిర్బంద విద్యను అందించాల్సి ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా ముసాయిదా చట్టం ఆధారంగానే జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందని విమర్శించారు. దీంతో గిరిజన ప్రాంతాల్లో కొండ కోనల్లో నివసిస్తున్న ఆదివాసీ చిన్నారులు విద్యకు దూరం అవుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పాఠశాలలు మూసివేతను విరమించు కోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కే.పృధ్విరాజు, త్రినాధ్, ఎంఎం శ్రీను, భీమరాజు, బుజ్జిబాబు, రామదాసు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని ఓల్డా పంచాయతీ పోసలగరువు ఎంపిపీ పాఠశాలను మూసి వేయవద్దని సీపీఎం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆందోళన నిర్వహించారు. అనంతరం హుకుంపేట మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, రేషనలైజేషన్ పేరుతో స్కూల్‌లను మూసివేస్తే విద్యార్థులు చదువుకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు.గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో విద్యార్థులు తక్కువగా ఉన్నారనే నెపంతో మెరకచింత, మధుము పాఠశాలలు మూసేస్తే ప్రస్తుతం విద్యార్థులు పెరిగిన తరువాత కూడా ఆ పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడం లేదన్నారు. గిరిజన ప్రాంతంలో గ్రామాల మధ్య దూరం చాలా ఎక్కువగా ఉంటుందని, పసిపిల్లలు నడుచుకుంటూ వేరే పాఠశాలకు వెళ్లగలరా అని ప్రశ్నించారు.గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణారావు మాట్లాడుతూ, గిరిజనులకు విద్యను దూరం చేయడమే కొత్త జాతీయ విద్యా విధానం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు రేగం మురళి, కంబిడి రాజు, రామకృష్ణ, బీమ్‌బాబు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూసివేత తగదు

పాడేరు: నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలో 87 స్కూల్స్ మూసివేయాలని నిర్ణయించడాన్ని గిరిజనులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని ఏపీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాలకు లక్కు వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఏజెన్సీలో విద్యకు దూరమై చాలా గ్రామాలు ఉన్నాయని గుర్తు చేశారు. పాఠశాల లను మూసి వేయడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టీచర్లను కుదింపు చేసే ప్రయత్నంలోనే నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి గ్రామాలలో ఉన్న స్కూళ్లని మూసి వేస్తోందని విమర్శించారు. పిల్లలు మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి చదవాలంటే కొన్ని గ్రామాల్లో రహదారి పూర్తిస్థాయిలో లేదన్నారు. దీనిపైన అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రజాప్రతినిధులు మౌనంగా ఉండటం తగదన్నారు.


సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

జోరుగా కోరెడ్ల రమాప్రభ ప్రచారం

ప్రజాశక్తి -యంత్రాంగం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న కోరెడ్ల రమాప్రభ గెలుపును కోరుతూ గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

మాధవధార : మురళీనగర్, మాధవధార, కళింగనగర్ ప్రాంతాల్లో కోరెడ్ల రమాప్రభ గురువారం ప్రచారం నిర్వహించారు. మురళీనగర్‌లోని వాకర్స్ పార్క్, బృందావన్, ఎమ్మెన్నార్ పార్క్ ప్రాంతాల్లో వాకర్స్‌ను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.శ్రీదేవి, బిటి.స్వామి, కె.సుధాకరరావు, ఎస్‌టివి.రమణమూర్తి, పి.రామచంద్రరావు, నాయుడుబాబు, ఈటి రాంబాబు, నాయనబాబు, పాపారావు, ఎస్ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

కంచరపాలెం : డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఇండిస్ట్రియల్ ఎస్టేట్‌లో వాకర్స్‌ను కలిసి తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు ఎస్.సోమేశ్వరరావు, జి.సూర్యచంద్రరావు, ఎస్.అప్పలరాజు, పి.వెంకటరావు, కృష్ణమూర్తి, ఎస్టేట్ సిఐటియు ప్రెసిడెంట్ ఒ.అప్పారావు, నాయకులు ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

తగరపువలస : డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరుతూ స్థానిక సిఐటియు నాయకులు ఎస్.అప్పలనాయుడు, డి.బాబాజీ చిట్టివలస ప్రాంతంలో పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు.

కె.కోటపాడు : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పిడిఎఫ్, 250 ప్రజా సంఘాలు బలపరిచిన కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గురువారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు వనము సూర్యనారాయణ కె.కోటపాడులో ఎమ్మెల్సీ ఓటు ఉన్న వారి ఇంటికి వెళ్లి రమాప్రభకు ఓటు వేయాలని కోరారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసి, పేదల పక్షాన నిలబడిన రమాప్రభ ఎమ్మెల్సీగా గెలుపొందినట్లయితే అసెంబ్లీలో ప్రజలు గళం వినిపిస్తారని తెలిపారు. విద్యాధికురాలైన డాక్టర్ రమాప్రభ సమస్యలపై మంచి అవగాహన ఉందని, అటువంటి వ్యక్తి శాసనమండలికి వెళ్లడం ఎంతైనా అవసరమని పేర్కొన్నారు.


కె.కోటపాడులో ప్రచారం నిర్వహిస్తున్న నాయనబాబు తదితరులు


చిట్టివలసలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిఐటియు నాయకులు

కుక్కల దాడిలో 35 గొర్రెలు మృతి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి జోన్-2 పరిధి మధురవాడ సమీపం, ధర్మపురి కాలనీ వద్ద మంద వేసిన గొర్రెలపై బుధవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో సుమారు 35 గొర్రెలు మృతిచెందాయి. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం పోలాకి గ్రామానికి చెందిన రమణ గొర్రెలను పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడు ప్రతిఏటా దసరాకు మధురవాడ వచ్చి అప్పటి వరకు ఉన్న గొర్రెలను విక్రయించి తిరిగి స్వగ్రామానికి వెళుతుంటాడు. గత అక్టోబరులో సుమారు 200 గొర్రెలతో వచ్చి దర్మపురి కాలనీ సమీపంలో తాత్కాలిక నివాసం ఏర్పరుచుకొని ఉంటున్నాడు. బుధవారం రాత్రి గొర్రెల మందపై ఒకేసారి ఆరు కుక్కలు దాడి చేసి 35 గొర్రెలను కొరికి చంపాయి. సంఘటన జరిగిన ప్రదేశాన్ని వెటర్నరీ డాక్టర్లు అరుణ్, జివిఎంసి ఎఎమ్‌హెచ్‌ఎ డాక్టర్ కిశోర్ తదితరులు సందర్శించారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు గొర్రెల యజమాని రమణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు రూ.3 లక్షలు విలువైన గొర్రెలు చనిపోయినట్లు రమణ తెలిపాడు. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ఎఎమ్‌హెచ్‌ఎ కిశోర్ తెలిపారు.


కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మ హత్య

ప్రజాశక్తి-హుకుంపేట: చెడు అలవాట్లకు బానిసై యువకుడు ఆత్మహత్యకి పాల్పడిన ఘటన మండలంలోని తడిగిరి పంచాయతీలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ముంచంగిపుట్టు మండలం కిలగడా పంచాయతీ మాలకరి పుట్టు గ్రామంలో 20ఏళ్ల క్రిందట పాంగి లక్ష్మణ్ హుకుంపేట మండలం తడిగిరి పంచాయతీ గ్రామంలో వలస వచ్చి నివాసం ఉంటున్నాడు. అరుకు రైల్వే స్టేషన్ లో దొరికిన ప్రసాద్‌ను లక్ష్మణ్ దత్తత తీసుకుని పెంచుతున్నాడు. చెడు అలవాట్లు మానమని తండ్రి చెప్పడంతో మనస్తాపం చెందిన పాంగి.ప్రసాద్(21) బుధవారం రాత్రి సుమారు 9 గంటల సమయం ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. ఊరు పక్కనే గురువారం ఉదయం చింత చెట్టుకు ఉరి వేసుకున్నాడు. గ్రామ ప్రజల సమాచారం మేరకు గ్రామంలో ఎస్సైఐ సతీష్ పర్యటించిన ఘటనపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని పెద్దేరు నది నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఏపి 39 7జి 3046 నెంబర్ గల వ్యాన్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు బుచ్చయ్యపేట ఎస్సై కుమార్ స్వామి గురువారం తెలిపారు. ఇసుక రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించి, నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

స్కూటీ డిక్కీ నుంచి రూ.2.18 లక్షల చోరీ

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : ఎలమంచిలిలో ఘరానా దోపిడీ జరిగింది. పట్టపగలే స్కూటీ డిక్కీ నుంచి రూ.2.18 లక్షలు చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... యలమంచిలి పట్టణానికి చెందిన చక్క అప్పారావు గురువారం యలమంచిలి స్టేట్ బ్యాంకులో రూ.2.28 లక్షలు విత్ డ్రా చేశారు. అందులో పదివేల రూపాయల మొత్తానికి సంబంధించి నోట్లు చిరిగి ఉండడంతో గమనించి రూ.2.18 లక్షలను తన స్కూటీ డిక్కీలో పెట్టి, చిరిగిన నోట్లు మార్చడానికి బ్యాంకు లోపలకు వెళ్లారు. ఆయన తిరిగి వచ్చేసరికి స్కూటీ డిక్కీలో పెట్టిన 2.18 లక్షలు అపహరణకు గురయ్యాయి. దీంతో బాధితుడు ఎలమంచిలి పోలీసులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రూ.31 లక్షలు చోరీకి గురైన సంగతి తెలిసిందే. మరో సంఘటనలో 18 లక్షలు అపహరణకు గురయ్యాయి. ఎలమంచిలి పట్టణంలో తరచూ దొంగతనాలు జరుగుతుండడంతో స్థానిక వ్యాపారులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో జరిగిన దొంగతనాలకు సంబంధించి సంవత్సరాలు గడుస్తున్న పోలీసులు రికవరీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి చోరీకి గురైన సొత్తును రికవరీ చేయవలసిందిగా బాధితులు కోరుతున్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- మాకవరపాలెం: మండలంలో కొండల అగ్రహారం జంక్షన్ వద్ద ఎస్సై రామకృష్ణ సిబ్బంది కలిసి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు బైక్ పై వెళుతున్న ఇద్దరి వ్యక్తులను తనిఖీ చేసి 10కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండుకు తరలించామన్నారు.

పేకాట శిబిరంపై దాడి : 14 మంది అరెస్టు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని తాటితూరు గోస్తనీ సమీపంలో గురువారం పేకాట శిబిరంపై స్థానిక ఎస్ఐ గంటా హరీష్ ఆధ్వర్యాన సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న తాటితూరు కల్లాలుకు చెందిన 14 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.61,170 స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుబ్బారెడ్డిని కలిసిన జెడ్‌పిటిసి

ప్రజాశక్తి -హుకుంపేట: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, వైసిపి ఉత్తరాంధ్ర ఇంచార్జి వైవి సుబ్బారెడ్డిని జడ్పీటిసి రేగం మత్స్య లింగం గురువారం విశాఖలో కలిశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న పలు సమస్య లను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.


సుబ్బారెడ్డిని కలిసిన జెడ్‌పిటిసి

పోరాట యోధురాలు పార్వతమ్మకు అశ్రు నివాళి

కన్నుమూసిన విశాఖ ఉద్యమ స్వరం
కడవరకూ ఎర్రజెండాతోనే పయనం
మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయంతో కలిసి ఉద్యమాలు
సారా వ్యతిరేకోద్యమంలో కీలకపాత్ర
సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాటాలు
నేడు తిమ్మరాజుపేటలో అంతిమయాత్ర
హాజరుకానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు


పార్వతమ్మ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - అచ్యుతాపురం, విశాఖ కలెక్టరేట్, గ్రేటర్ విశాఖ బ్యూరో

అలుపెరగని పోరాట యోధురాలు, సిపిఎం సీనియర్ నాయకురాలు కర్రి పార్వతమ్మ (84) బుధవారం రాత్రి అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట గ్రామంలోని తన స్వగృహంలో కన్నుమూశారు. ఆమె ఎందరికో ఆదర్శం. తొలితరం విశాఖ ఉద్యమ స్వరం. ప్రజా సమస్య ఎక్కడుంటే అక్కడామె ఉన్నారు. పరిష్కారమయ్యేంత వరకూ పోరాడారు. బుధవారం సాయంత్రం వరకూ ప్రజలతో మంచి చెడ్డా మాట్లాడుతూ ఆమె గడిపారు. ఒక్కసారిగా ఆరోగ్య పరిస్థితి క్షీణించి క్షణికకాలంలోనే ప్రాణాలు విడిచారు. ఆమె మృతి వార్త తెలియగానే పలువురు తల్లడిల్లారు. ఆమె ఉద్యమ ప్రాబల్యం ఉన్న ప్రాంతమంతటా విషాదఛాయలు అలుముకున్నాయి.

కశింకోట మండలం గొబ్బూరు గ్రామంలో జన్మించిన పార్వతమ్మ కర్రి నర్సింగరావును వివాహం చేసుకున్నారు. తిమ్మరాజుపేట కేంద్రంగా తన ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఈ ప్రాంతంలో దొడ్డి రామునాయుడు, ఆళ్ల శ్రీరాములు, పివి.రమణ, కె.గోవిందరావులు వంటి మహానేతలతో కలిసి ఉద్యమంలో నడిచారు. మహిళా జాతీయ నాయకురాలు మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయం, పుణ్యవతి వంటి వారితో కలిసి మహిళా ఉద్యమాలకు నాయకత్వం వహించారు. సారా వ్యతిరేక ఉద్యమాన్ని ఈ ప్రాంతంలో ఉవ్వెత్తున నడిపారు. విశాఖ జిల్లాలో మహిళా సంఘం స్థాపించి మొట్టమొదటి అధ్యక్షులుగా పార్వతమ్మ భాద్యతలు చేపట్టారు. నాడు వైదాడ ధర్మారం కార్యదర్శిగా జిల్లాలో మహిళా ఉద్యమాన్ని స్థాపించారు. సారా వ్యతిరేక ఉద్యమంలో ఈ ప్రాంతంలోని మహిళ లందరినీ సమీకరించి ఉద్యమాలు నడిపారు. ఎరువుల బ్లాక్ మార్కెటింగ్, బెల్లం రైతుల ఉద్యమం, నల్ల బెల్లం, క్రషర్ల ఉద్యమం, విద్యుత్ ఉద్యమాలు వంటి అనేక పోరాటాల్లో భాగస్వాములయ్యారు. నాడు ఈ ప్రాంతంలో మంచినీటి సమస్యపై నీటి ఎద్దడి వచ్చిన ప్రతి సందర్భంలోనూ పెద్ద ఎత్తున మహిళలను సమీకరించి తిమ్మరాజుపేట నుంచి అచ్యుతాపురం ఎంఆర్‌ఒ ఆఫీస్ వరకూ మహిళలందరితో ఖాళీ బిందెల ప్రదర్శనలు అనేకం నిర్వహించారు. దళిత, బడుగు, బలహీనవర్గాలతో మమేకమయ్యారు.

నేడు తిమ్మరాజుపేటలో అంత్యక్రియలు

- హాజరుకానున్న బివి.రాఘవులు

శుక్రవారం ఉదయం తిమ్మరాజుపేటలో పార్వతమ్మ అంత్యక్రియలు జరుగనున్నాయి. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తదితరులు హాజరుకానున్నారు. స్థానికంగా సభ జరుగనుంది.

పోరాటమే శ్వాసగా సాగిన జీవనం


పార్వతమ్మ పార్థివ దేహం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం, తదితరులు

పార్వతమ్మ జీవనం పోరాటంతోనే సాగింది. వివాహమైనప్పటి నుంచీ ఆమె భర్త అడుగుజాడల్లో నడుచుకుంటూ భర్తతోపాటు తనూ పోరాటాల్లో పాల్గొనేది. పార్టీ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషించేది. ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధనగా ఇద్దరూ కలిసి వ్యవసాయం చేయించేవారు. ఒకవైపు వ్యవసాయం మరొకవైపు కుటుంబ బాధ్యతలు, ఇంకోవైపు సిపిఎం సభలు, సమావేశాల్లో చురుకైన పాత్ర పోషించేవారు. భర్త అకాలంగా మృతి చెందినప్పటికీ ఆమె పోరాటాన్ని ఆపలేదు. గ్రామంలో అగ్ని ప్రమాదం సంబంధించి కట్టుబట్టలతో రోడ్డుపై పడిన అగ్ని బాధితులకు బాసటగా నిలిచారు. విరాళాలు సేకరించి వంట పాత్రలు అందించారు. ఆర్థిక సహాయం చేశారు. వరద బాధితులకు సహాయ కార్యక్రమాలను చేయడంలోనూ ఆమె చురుకైన పాత్ర పోషించారు.

మద్యం షాపులపై దాడి

సంపూర్ణ మద్యపాన నిషేధం సమయంలో దోబగుంటలో పోరాటం మొదలైందని తెలిసిన వెంటనే ఆమె ఇక్కడ స్పందించారు. గ్రామంలో ఉన్న మద్యం షాపులపై తోటి మహిళతో సామూహికంగా దాడి చేశారు షాపులు మూసేంత వరకూ పోరాటం కొనసాగించారు. మద్యం సేవించిన వారితో ప్రమాణం చేయించి వారిని మద్యపాన నిషేధ పోరాటంలో భాగస్వామ్యం చేసిన ఘనత పార్వతమ్మకు దక్కుతుంది. గ్రామంతోపాటు మద్యం సిండికేట్ కొండకర్లలో ఉండేది. సిండికేట్ వ్యాపారి వద్దకు మహిళలతో తరలి వెళ్లి తీవ్ర స్థాయిలో ఆనాడు ధ్వజమెత్తారు. గ్రామం నుంచి మొదలైన ఆమె పోరాటం మునగపాక, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ, యలమంచిలి మండలాల్లోనూ సాగింది. ఆమె కులాంతర వివాహాలను ప్రోత్సహించేవారు. కట్న వేధింపులతో బాధపడుతున్న మహిళలకు అండగా నిలిచి వారి తరపున పోలీస్ స్టేషన్లకు తరలివెళ్లి న్యాయం చేసే వరకు బాధిత కుటుంబాలతో కలిసి పనిచేశారు.

పార్వతమ్మ ఇల్లే సత్రం

పార్టీ పరంగా గ్రామానికి వచ్చి ప్రజలతో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడానికి పార్టీ కార్యకర్తలకు ఆమె ఇల్లే కార్యాలయంగా నిలిచింది. పార్టీ నుంచి.. ఎక్కడి నుంచి.. ఏ స్థాయి నుంచి ఎవరొచ్చినా ఆమె ఇంటికి వచ్చేవారు. వారిని సాదరంగా స్వాగతించి భోజనం, వసతి సదుపాయాలు సమకూర్చేవారు. ఇంటి దగ్గరకే కులవృత్తిదారులను, పార్టీ కార్యకర్తలను పిలిచి తరగతులు నిర్వహించేవారు. గ్రామస్థాయి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. మహిళలకు బహుముఖ పోటీలు నిర్వహించి వారిలో చైతన్యం నింపారు.

మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయంతో కలిసి ఉద్యమం

పార్వతమ్మ రైతు ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. మునగపాకలో జిల్లా స్థాయి రైతు సంఘం సమావేశం ఏర్పాటు చేసినప్పుడు ఆమె మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయంతో కలిసి పని చేశారు. తిమ్మరాజుపేట గ్రామంలో వారి ఇద్దరితో కలిసి ఇంటింటికీ తిరిగారు. ఐద్వా జాతీయ నేత పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి అలా పలువురితో కలిసి ఆమె చురుగ్గా పని చేశారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తదితరులతో కలిసి ఉద్యమాల్లో పాల్గొన్నారు.

కమ్యూనిస్టు కుటుంబం

పార్వతమ్మకు ఇద్దరు కుమార్తెలు రూపవతి, సుగుణవతి, ఇద్దరు కుమారులు సుందరయ్య, స్వామి బాబు ఉన్నారు. వారిని కమ్యూనిస్టు భావాలకు అనుగుణంగానే పెంచి పెద్ద చేశారు. 1979లో తన 40వ ఏటే భర్త మరణించినా పిల్లలను పెంచి ఉన్నతంగా తీర్చిదిద్దారు. మహిళలను సైతం పురుషులతో సమానంగా పెంచారు. వారికి ఆ కాలంలోనే సైకిల్ తొక్కటం వంటివి నేర్పారు. పురుషులతో సమానంగా ఆటలలో ప్రోత్సహించారు. నేటికీ కుమారులు సుందరయ్య, స్వామి బాబు ప్రజా సమస్యలపై పనిచేస్తున్నారు. సుందరయ్య ఎస్ఎఫ్ఐ ఉద్యమ నాయకునిగా పలు సమస్యలపై పోరాటాలు నడిపారు.

సిపిఎం, ఐద్వా ఘన నివాళి

పార్వతమ్మ పార్థివ దేహంపై సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పార్టీ పతాకాన్ని కప్పి ఘనంగా నివాళ్లర్పించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, ప్రజా సంఘాల నాయకులు ఎ.బాలకృష్ణ, కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు, ఆర్.రాము, వివి.శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, కె.సోమునాయుడు, రామసదాశివరావు, తదితరులు నివాళ్లర్పించిన వారిలో ఉన్నారు. లోకనాథం మాట్లాడుతూ ఆమె పోరాట గొప్పతనాన్ని వివరించారు. పార్వతమ్మ ఎందరికో ఆదర్శమన్నారు. పార్వతమ్మ మృతి మహిళా ఉద్యమాకి తీరని లోటు అని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా మహిళా ఉద్యమ నిర్మాతల్లో ఆమె ఒకరన్నారు. పార్వతమ్మ కుటుంబ సభ్యులకు పార్టీ తరపున సానుభూతిని తెలిపారు. పార్వతమ్మ మృతికి ఐద్వా విశాఖ, అనకాపల్లి జిల్లా కమిటీలు సంతాపం తెలిపాయి. ఈ మేరకు విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి ఒక ప్రకటన విడుదల చేశారు.

సీలేరులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో గురువారం రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహణ కార్యదర్శి కె.వెంకట సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి, తెలుగు యువత నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జికె.వీధి మండల అధ్యక్షుడు ముక్కల రమేష్, తెలుగు రైతు నాయకులు కె.వెంకట ప్రసాద్, యూనిట్ ఇన్‌ఛార్జి కె.సన్యాసిరావు, బూత్ కన్వీనర్లు రాము, నూకరాజు, లూసీ, ఇన్‌ఛార్జి సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, పార్టీ నాయకులు ఎల్.నాగభూషణం, జి.సోమేష్ పాల్గొన్నారు.

'జివిఎంసిని దోచుకుంటున్న షాడో మేయర్'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మేయర్ గొలగాని హరి వెంకట కుమారి భర్త కాసులకు కక్కుర్తి పడి షాడో మేయర్‌గా అవతరించి జివిఎంసి ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర పాలక సంస్థ పాలక వర్గం ఏర్పడ్డప్పటి నుంచీ మేయర్ భర్త గొలగాని శ్రీనివాసరావు షాడో మేయర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. క్యాంప్ ఆఫీస్ పేరు చెప్పి లక్షలాది రూపాయలను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. మేయర్ ఖర్చులపై శ్వేత పత్రం విడుదల చేస్తే ఆ భాగోతమంతా బయటపడుతుందన్నారు. సమావేశంలో జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు, శ్రీనివాస పట్నాయక్, రూప పాల్గొన్నారు.

28న విజెఎఫ్ కళా ప్రోత్సాహక పోటీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విశాఖ నగరంలోని జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు కళారంగ ప్రోత్సాహక పోటీలను నిర్వహిస్తున్నట్లు వైజాగ్ జర్నలిస్టుల ఫోరం (విజెఎఫ్) అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 7న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. గీతాలాపన, రంగవల్లులు విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసిన పది మందిని 7న ప్రెస్‌క్లబ్‌లో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో సత్కరిస్తామన్నారు. ఇతర వివరాలకు 9393114901, 9059308958 నెంబర్లను సంప్రదించాలన్నారు.

693వ రోజుకు 'ఉక్కు' జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 693వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (హెచ్ఎంఎస్) కార్మికులు పాల్గొన్నారు. అధ్యక్షుడు జి.సత్యారావు, కార్యదర్శి జి.రమణ మాట్లాడారు.

ఔషధ రంగంలో అద్వితీయ ప్రగతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఔషధ రంగంలో భారత్ అద్వితీయమైన ప్రగతి సాధిస్తోందని అమెరికాలోని ఎఫ్ఎ డ్రగ్ క్వాలిటీ డివిజన్ డైరెక్టర్ డాక్టర్ కార్మిలో రోసా అన్నారు. గురువారం ఎయు వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో ఎయు-యుఎస్ ఎఫ్ఎ సంయుక్తంగా నిర్వహించిన 'కరెంట్ గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్' రెండు రోజుల వర్క్ షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నాణ్యమైన ఔషధాల తయారీకి నిరంతరం కృషి జరగాలన్నారు. మరింత మెరుగైన, నాణ్యమైన తయారీ విధానాలను అనుసరించడం ఎంతో అవసరమన్నారు. ఔషధ తయారీ, అనుమతులు, వినియోగం వరకు వివిధ దశల్లో అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కల్పించారు. ఔషధ తయారీలో నియమావళిని క్షుణ్ణంగా పరిశ్రమలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి అవసరమైన ఔషధాలను అందించడానికి దార్శినికతతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాలసీ అడ్వైజర్ బ్రూక్ హిగ్గిన్స్, సీనియర్ ఫార్మసూటికల్ ఎసెసర్ అదితి ఠాకూర్, కంజ్యూమర్ సేఫ్టీ ఆఫీసర్ సలీమ్ అక్తర్, తదితరులు ప్రసంగించారు.

ఎల్‌హెచ్‌బి కోచ్‌లతో జన్మభూమి ఎక్స్‌ప్రెస్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే క్రమంలో 20 ఆధునిక లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బి) ర్యాక్‌లతో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను గురువారం ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ ప్రారంభించింది. ఈ నెలలో ఉద్యోగ విరమణ చేయనున్న రామగోపాలరావు, డివి ప్రసాద్ పి.జాన్ తిమోతి నూతన కోచ్‌లతో కూడిన ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి మాట్లాడారు.